


# డీల్

- కారంపూడి వెంకట రామదాస్

ఉగాది పోటీలో ఎంపికైన కథ

ప్రభుత్వ కార్యాలయం గంట ఐదుకొట్టింది.

అంతే! ఆరోజుకి పనివేళలు ముగిసినట్టే! మోహన్‌రావు ఆఫీసు పని పూర్తిచేసి రూమ్ దాటి బయటకి వస్తూ ఎదురుగావున్న గోడమీద కాప్షన్ వైపు అనుకోకుండా చూసాడు. భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు. వెంటనే అతడికి తెలీకుండానే తల కిందకి వాలింది. ఈ పరిస్థితి రోజూ అతడికి ఆఫీసు నుండి బయటపడేటప్పుడు తప్పట్లేదు. మనసున్న ఎవరికైనా ఆ కాప్షన్ చూస్తే ఆ పరిస్థితి తప్పదు. కారణం ఆ కాప్షన్‌కున్న పవర్ అలాంటిది!

'మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి... ఈరోజు మీకొచ్చే జీతానికి న్యాయం చేశారా?'

సూటిగా ప్రతి ఉద్యోగి హృదయాన్ని తాకే ఆ కాప్షన్ ఏ మహానుభావుడు రాశాడో గానీ, దాన్ని కన్నెత్తి సూటిగా చూసే ధైర్యం అక్కడి చాలామంది ఉద్యోగులకి లేదు. అసలే ప్రభుత్వ కార్యాలయం... దాన్ని చూసీచూడనట్టు తల తిప్పుకునిపోయేవారే తప్ప... ఆలోచించేవారే కరువు. కాని మోహన్‌రావు ఆ పని చేయలేకపోతున్నాడు. సాధ్యమైనంతవరకు తన వృత్తికి న్యాయం చెయ్యాలనే తపన అతడిలో వుంది.

బయట పడగానే ఆఫీసు ఆవరణంలో దర్శనమిచ్చే ట్రాన్స్‌ఫార్మర్లు...! ఒకటా, రెండా...? ఏకంగా రెండువందల ట్రాన్స్‌ఫార్మర్లు... ఒక్కొక్కటీ లక్షపైచిలుకే!... అన్నీ వృధాగా పడున్నాయి. సుమారు రెండు కోట్ల ప్రభుత్వ ధనం మట్టిపాలైనట్టే...!

మోహన్‌రావు ముందు పనిచేసిన ఓ చీఫ్ ఇంజినీర్ అవినీతికి నిలువుటద్దంలా వున్నాయా ట్రాన్స్‌ఫార్మర్లు. అవసరం లేకున్నా మంత్రిగారి బంధువుకి చెందిన కంపెనీనుండి కొన్నాడా చీఫ్ ఇంజనీర్. ఆ లావాదేవిలో మంత్రిగారూ, ఆ చీఫ్ ఇంజనీర్ యిద్దరూ లక్షల్లో మింగేశారు.

మోహన్‌రావు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు... ఈ కోట్ల రూపాయల ప్రజధనం యిలా వృధాకాకూడదు... ఏదో ఒకటి చెయ్యాలి... అని మనసులో స్థిరంగా నిశ్చయించుకున్నాడు.

* * *

"మిస్టర్ శివా! ఆ ట్రాన్స్‌ఫార్మర్ల పూర్తి డిటైల్స్, వాటికి సంబంధించిన మొత్తం ఫైల్స్ పుటప్ చెయ్యి! ఐవాంట్ దోజ్ డిటైల్స్ యిమ్మిడియేట్లీ!" అన్నాడు మోహన్‌రావు తన స్టెనోతో.

గంటలో మొత్తం ఫైల్స్ మోహన్‌రావు టేబులుపైన పెట్టాడు శివ.

"ఒ.కె.! యుకెన్ కమ్ ఆఫ్టర్ వన్ అవర్..." శివతో అన్నాడు మోహన్‌రావు.

ఫైల్స్‌ని క్షుణ్ణంగా పరిశీలించాడు. అంతా అవకతవకల మయం. ఒకటే మార్గం... తన వంతు ప్రయత్నం చెయ్యాలి!

"సార్! మే ఐ కమిన్?" అంటూ శివ లోపలికి వచ్చాడు.

"టేక్ యువర్ సీట్... ఆల్సో టేక్ ఎ లెటర్..."అంటూ లెటర్ డిక్టేట్ చేసాడు మోహన్‌రావు.

"టు, మెసర్స్ దీపికా ఎలక్ట్రికల్స్, బాలానగర్, హైద్రాబాద్..." అంటూ లెటర్ మొదలుపెట్టాడు మోహన్‌రావు.

ఆ ఉత్తర సారాంశం ఏమిటంటే... 'వ్యాపార ధర్మానికి విరుద్ధంగా ఈ లేఖ వుంటే మన్నింప ప్రార్థన. కోట్ల రూపాయల ప్రజాధనం వృధాగా పడుంటే మౌనంగా వుండలేక ఈ ఉత్తరం వ్రాస్తున్నాము. మిలియన్లలో వ్యాపారం చేస్తూ లాభాల బాటలో నడుస్తున్న ప్రముఖ సంస్థ మీది. మీ సంస్థ నుండి కొనుగోలు చేసిన వందల ట్రాన్స్‌ఫార్మర్లు మావద్ద వృధాగా, నిరుపయోగంగా పడున్నాయి. వాటిని మీరు వెనక్కి తీసుకుంటే ఆ ధనం వేరే ప్రజోపకార్యానికి ఉపయోగపడుతుంది. ఇందులో మీకు లాభం లేకపోలేదు. మేము కొనుగోలుచేసిన వెలలో డెబ్బై ఐదు శాతం మాత్రం చెల్లించి మీ సరుకు మొత్తాన్ని తిరిగి పొందవచ్చు. కేవలం వ్యాపారం దృష్టితో గాక సామాజిక ప్రయోజనాన్ని కూడా దృష్టిలో వుంచుకుని నిర్ణయం తీసుకోగలరని ఆశిస్తూ మీ జవాబుకై ఎదురు చూస్తున్నాము.

ఆ ఉత్తరాన్ని వెంటనే టైపుచేసి ఫాక్స్ చెయ్యమన్నాడు మోహన్‌రావు. ఒరిజినల్ కాపీని రిజిస్టర్ పోస్టులో కూడా పంపమన్నాడు.

* * *

"సార్! వారమైనా దీపక్ ఎలక్ట్రికల్స్ నుండి ఎటువంటి సమాధానం రాలేదు" అన్నాడు శివ.

"ప్రయత్నిద్దాం... మళ్ళీ మళ్ళీ ప్రయత్నిద్దాం... వాళ్ళ దగ్గర నుండి రిప్లై వచ్చేవరకు రిమైండర్స్ పంపుతుండు"అన్నాడు మోహన్‌రావు.

మరో నాల్రోజులు గడిచాయో లేవో, ఒక రోజు-

"సార్! రిప్లై వచ్చింది. వాళ్ళేమన్నారంటే... 'మీరు పంపిన ప్రతిపాదన చూసి కాసింత నవ్వు తెప్పించిన మాట వాస్తవం. పూర్తిగా వ్యాపార దృక్పథంతో ముందుకు సాగుతున్న మాకు, మీ ప్రతిపాదనని అంగీకరించడమంటే, మా నిబంధనలని ఉల్లంఘించడమే! మాకున్న ముఖ్యమైన వినియోగదారుల్లో మీరూ ఒకరైనందున, మేమిచ్చిన వారంటీని మరో రెండు సంవత్సరాలు పొడిగిస్తున్నాము. ఈలోగా మీ సరుకుని వాడుకుని సద్వినియోగపరచుకోగలరని ఆశిస్తున్నాము"అంటూ స్వయంగా దీపక్ ఎలక్ట్రికల్స్ ఎం.డి. పంపారు."

ఈ జవాబు మోహన్‌రావుని తీవ్ర నిరాశకి గురిచేసింది. అయినా చివరి ప్రయత్నం చేద్దామనుకున్నాడు.

* * *

మోహన్‌రావు తన రొటీన్ పనిలో తల మునకలైవున్నాడు.

"సార్! మిమ్మల్ని కలవడానికి దీపక్ ఎలక్ట్రికల్స్ నుండి రీజనల్ మేనేజర్ మిస్టర్ కామేశ్వరరావు వచ్చారు" ఆనందంగా అన్నాడు శివ.

'వాట్!' దీపక్ ఎలక్ట్రికల్స్‌నుండి ఆర్.ఎమ్. వచ్చారా? నమ్మశక్యం కాక అన్నాడు మోహన్‌రావు. వెంటనే తేరుకుని-

"ఆయన్ని లోపలికి పంపు" అన్నాడు మోహన్‌రావు.

లోపలికొచ్చిన కామేశ్వరరావుని సాదరంగా ఆహ్వానించి కూర్చోమన్నాడు మోహన్‌రావు. ఆ తరువాత ఆఫీస్ బోయ్‌ని పిలిపించి కాఫీ, స్నాక్స్ తెమ్మన్నాడు.

"మీరు పట్టుదలతో వ్రాసిన ఉత్తరాలు మాకు అందాయి. ఈ విషయంపై వివరంగా మీతో మాట్లాడాలని మా మేనేజ్‌మెంట్ నిర్ణయించింది. అందుకే నేను వచ్చాను."

"చాలా థాంక్స్! మీ సంస్థ మిమ్మల్ని పంపి మంచి నిర్ణయం తీసుకుంది. యిప్పుడు చెప్పండి మా ప్రతిపాదనపై మీ అభిప్రాయం?" సూటిగా అడిగాడు మోహన్‌రావు.

"ఒకసారి అమ్మిన పరికరాలని తిరిగి తీసుకోవడం ఏ వాణిజ్య సంస్థా సమ్మతించదు. ఐతే... మీరు వ్రాసిన ఒకే

ఒక వాక్యం మా సంస్థని ఆలోచనలో పడేసింది. 'ప్రజా ధనం వ్యర్థంకాకుండా సామాజిక బాధ్యతతో మీరు ఆలోచించమన్నారు' అదే, మీతో చర్చలకి దారి తీసింది."

"నేను పై అధికారుల పర్మిషన్‌తో ఇరవైఐదు శాతం కోతకి మీ మొత్తం సరుకుని తిరిగి యిచ్చివేయదలచాను. మీకు లాభమేగాక ఒక మంచి పనికి మీరు చేయూతనిచ్చిన వారవుతారు."

"మోహన్‌రావుగారూ! ఇరవై ఐదు శాతం మాకు కిట్టుబాటు కాదు. యాభై శాతం తగ్గింపుకైతే మాకు ఓ.కే.!"

"అది కాదు కామేశ్వర్రావుగారూ! కనీసం అరవై శాతం యిస్తానంటే నెనెలాగో నా పై అధికారులని ఒప్పించగలను."

"అమ్మిన సరుకుని వాపసు తీసుకోవడమే పెద్ద విషయం! యిక అరవై శాతం ఆశించడం అత్యాశే! యాభై శాతంకి మించి మేము యిచ్చుకోలేము, ఆపై మీ యిష్టం" ఖచ్చితంగా అన్నాడు కామేశ్వర్రావు.

మోహన్‌రావు కాసేపు ఆలోచించాడు.

"సరే! నన్ను మా అధికారులతో మాట్లాడనివ్వండి! ఆ తరువాత ఓ నిర్ణయానికొస్తాను. అంతవరకు మా గెస్ట్ హౌస్‌లో లంచ్ చేసి రెస్టు తీసుకోండి" అన్నాడు మోహన్‌రావు.

"సరే...!" అని లేచాడు కామేశ్వర్రావు. ఆఫీస్ బోయ్ అతడ్ని గెస్టుహౌస్‌కేసి తీసుకెళ్ళాడు.

మోహన్‌రావుకి తెలుసు తన పై అధికారులు తన మాట కాదనరని! అయినా ఒక ముక్క చెప్పటం తన ధర్మంగా తలచాడు. అసలే వ్యర్థమైపోయిందనుకున్న సరుక్కి సగం రేటు రావడం చాలా ఎక్కువే. అసలు వాళ్ళు మనసు మార్చుకుని తన దగ్గరకి రావడమే గొప్ప మాట! అలాంటి ఈ అవకాశాన్ని అస్సలు ఒదులుకోకూడదు. వెంటనే సెక్రటరీతో చెప్పి తన పై అధికారిని లైనులో పెట్టమన్నాడు. ఫోన్‌లో మొత్తం విషయం వివరించి పై అధికారి అంగీకారాన్ని లాంఛనప్రాయంగా తీసుకున్నాడు.

మోహన్‌రావుకి రోజూ ఆఫీసులోనే లంచ్ చెయ్యడం అలవాటు. ఆరోజు లంచ్ తరువాత కొద్దిసేపు రొటీన్‌గా పేపరు తిరగేసాడు. బిజినెస్ పేజీలో ఓ మూల ఓ చిన్న వార్త అనుకోకుండా అతడి దృష్టిని ఆకర్షించింది. ఆ వార్తని చకచక చదివాడు. దీర్ఘంగా ఆలోచించిన మోహన్‌రావుకి ఓ విషయం చూచాయగా అర్థమైంది. ఆ వెంటనే అతని మొహంలో రంగులు మారాయి.

"శివా...! కామేశ్వర్రావు వస్తే... నేను వేరే అర్జంట్ పనిలో వున్నాను... రేపు కలుస్తానని చెప్పు" అన్నాడు మోహన్‌రావు.

అదే విషయం గెస్ట్‌హౌస్‌లో వున్న కామేశ్వర్రావుకి అందవేసాడు శివ.

కామేశ్వర్రావు 'సరేలే'అనుకుని మరునాడు వరకు వేచి వుండేందుకు సిద్ధపడ్డాడు.

ఆ మర్నాడు కూడా కామేశ్వర్రావుకి, మోహన్‌రావు దర్శనం కరువైంది. దాంతో మోహన్‌రావు ప్రవర్తనపై మొదటిసారిగా అనుమానం వచ్చింది అతడికి. వెంటనే ఫోన్‌లో ట్రైచేసాడు.

"సారీ మిస్టర్ కామేశ్వర్రావు! ఐయామ్ టూ బిజీ టు డిస్కస్ విత్ యు నౌ!" అన్నాడు మోహన్‌రావు.

"సార్! వన్ మినిట్! వుయార్ థరో ప్రొఫెషనల్స్! ఐ హేవ్ లిటిల్ టైమ్! సరే... మీరడిగిన అరవై శాతం యివ్వడానికి రెడీ... డీల్ యిక్కడితో క్లోజ్ చేద్దాం!"

"అబ్బే... అందుక్కాదు... నేను కాస్త బిజీ..."అని ఫోన్ కట్ చేసాడు మోహన్‌రావు. అతికి ఈ ఫోన్‌తో పూర్తిగా విషయం అర్థమైంది. ఇక ఈ మేటర్ని ఎలా డీల్ చెయ్యాలో మనసులో ఒక ప్రణాళికని తయారుచేసుకున్నాడు.

యిటు కామేశ్వర్రావుకి, మోహన్‌రావు ఏ సమాధానం చెప్పకుండా ఫోన్ కట్ చెయ్యడం ఆందోళన కలిగించింది. ఎంత తొందరగా అతన్ని కలవాలా అని తహతహలాడాడు.

యిలా మరో రోజు యిదిగో, అదిగో అంటూనే కావాలనే కామేశ్వర్రావుని కలవలేదు మోహన్‌రావు. కామేశ్వర్రావుకి ఒక వైపు టెన్షన్ పెరిగిపోతున్నది. ఆరోజు ఏదోఒకటి తేల్చుకోవాలనే నిర్ణయానికి వచ్చేసాడు. మళ్ళీ ఫోన్ చేసాడు.

"సార్! ప్లీజ్ గేవ్ మీ యువర్ అపాయింట్‌మెంట్! ఐడోంట్ హేవ్ ఎనీ టైం! టుడే ఐహేవ్‌టు లీవ్!" కోపాన్ని అణచుకుని అర్థించాడు.

"ఓ.కే... వుయ్ విల్ మీట్ ఎట్ లెవెన్!"అన్నాడు మోహన్‌రావు.

"హమ్మయ్యా!" అనుకున్నాడు కామేశ్వర్రావు.

ఆరోజు పదకొండు గంటలకి ఇద్దరూ కలిసారు.

"సారీ మిస్టర్ కామేశ్వర్రావు. వేరే అర్జంట్ పనిలో పడి మిమ్మల్ని కలవలేకపోయాను. బై ది బై మా డిపార్ట్‌మెంట్ మనసు మార్చుకుంది. ఆ ట్రాన్స్‌ఫార్మర్లకి సరైన ధర వస్తేనే అమ్మమని ఆర్డర్స్. సో అయామ్ సారీ..." కూల్‌గా అన్నాడు మోహన్‌రావు.

ఈ సమాధానం విని కామేశ్వర్రావు అదిరిపడ్డాడు.

"అదేంటి? మాకు అన్ని ఉత్తరాలు రాసి, అరవై శాతంకి బ్రతిమలాడి యిప్పుడేంటి ఈ మాట? కోపంగానే అన్నాడు కామేశ్వర్రావు.

మళ్ళీ తనని తాను తమాయించుకుని-

"ఓ.కే... మీరు వ్రాసిన విధంగా డబ్భైశాతం సొమ్ముని తిరిగి చెల్లించి ఆ ట్రాన్స్‌ఫార్మర్లని తీసుకుంటాం... సరేనా...?" అసహనంగా అన్నాడు కామేశ్వర్రావు.

"నో... మా సొమ్ముకి వడ్డీ అదీ కలుపుకుని యిప్పటికే చాలా నష్టం కలిగింది. మేము చెల్లించిన ధర పూర్తిగా తిరిగిస్తే నేనేమైనా ప్రయత్నించగలను" అన్నాడు మోహన్‌రావు.

"వాట్ ఆర్ యూ సేయింగ్... నో మాకవసరం లేదు..."

"దెన్ యిట్స్ అప్ టు యు..." అంటూ పెదవి విరిచాడు మోహన్‌రావు.

నిమ్మకి నీరెత్తినట్టున్న మోహన్‌రావు ప్రవర్తన చూసి చిర్రెత్తుకొచ్చింది కామేశ్వర్రావుకి. కానీ తొందర పడకూడదనుకున్నాడు.

"లెట్ మీ డిస్కస్ విత్ మై మేనేజ్‌మెంట్..." అంటూ బయటకొచ్చి కామేశ్వర్రావు ఫోన్‌లో ఎం.డి.తో మాట్లాడాడు.

తిరిగి లోపలికొచ్చి-

"డన్! ... ఓ.కే... మీరడిగిన సొమ్ము యివ్వడానికి సిద్ధమే..." అయిష్టంతో అంగీకరించినట్టు మొహం పెడుతూ అన్నాడు కామేశ్వర్రావు.

"సరే... డి.డి. డిపాజిట్ చేసి మీ సరుకు మీరు తీసుకుని వెళ్ళొచ్చు..." అన్నాడు మోహన్‌రావు. ఇప్పుడు అతని మొహంలో ఆనందం తొంగి చూసింది. 'ఎంత ఎత్తు వేసారు వాళ్ళు?' అని మనసులోనే అనుకున్నాడు.

మోహన్‌రావుకి తెలుసు తన పై అధికారులు తన మాట కాదనరని! అయినా ఒక ముక్క చెప్పటం తన ధర్మంగా తలచాడు. అసలే వ్యర్థమైపోయిందనుకున్న సరుక్కి సగం రేటు రావడం చాలా ఎక్కువే. అసలు వాళ్ళు మనసు మార్చుకుని తన దగ్గరకి రావడమే గొప్పమాట! అలాంటి ఈ అవకాశాన్ని అస్సలు ఒదులుకోకూడదు. వెంటనే సెక్రటరీతో చెప్పి తన పై అధికారిని లైనులో పెట్టమన్నాడు.

* * *

"సార్! అద్భుతం సార్... అసలు పనికి రాదనుకున్న సరుకుని అసలు రేటుకి తిరిగి వాళ్ళచేతే కొనిపించగలిగారంటే, చాలా ఆశ్చర్యం! ఇదెలా సాధ్యం... సార్?" ఉత్సుకతని ఆపుకోలేక అడిగాడు శివ.

"వ్యాపారంలో ఎప్పుడూ లాభమే లక్ష్యం... అదే వారిని ఈ పనికి ఒప్పించింది" సూటిగా అన్నాడు మోహన్‌రావు.

"అసలు ధరకి తిరిగి తీసుకోవడం లాభమెలా అవుతుంది సార్...?" అర్థంకాక అన్నాడు శివ.

"పిచ్చివాడా... యిన్నాళ్ళూ మన ఉత్తరాల్ని చెత్తబుట్ట దాఖలు చేసి, చివరికి స్వయంగా వాళ్ళే మన దగ్గరకి వచ్చి ఏదో ప్రజోపకారం చేస్తున్నట్టు ఫోజుకొట్టి తమ పబ్బం గడుపుకోవాలని చూసారు. సరైన సమయానికి ఆ సంస్థకి చెందిన ఓ వార్త అనుకోకుండా నా దృష్టికి రావడంతో అసలు విషయం తెలిసింది. దాంతో వాళ్ళ అవసరాన్ని ఎన్‌కాష్ చేసుకున్నాడు."

"అసలు విషయం చెప్పండి సార్!" ఆతృతగా అన్నాడు శివ.

"దీపక్ ఎలక్ట్రికల్స్‌కి, 'నికేషియా ఎలక్ట్రికల్స్'అనే కొరియాకి సంబంధించిన మల్టీ నేషనల్ కంపెనీ యాభై కోట్ల ఎలక్ట్రికల్స్ ఎక్విప్‌మెంట్స్ సప్లైకి ఆర్డర్ యిచ్చింది. అనుకున్న సమయానికి సరుకు సప్లై చెయ్యకపోతే ఆ ఆర్డర్ రద్దు కావడమేగాక సెక్యూరిటీ డిపాజిట్‌గా దీపక్ ఎలక్ట్రికల్స్ కట్టిన పది కోట్ల సొమ్ము కోల్పోక తప్పదు. అదీ ఒప్పందం. సప్లై చెయ్యవలసిన ఆ పరికరాలలో ముఖ్యమైనవి 'ట్రాన్స్‌ఫార్మర్లు'! వందల్లో ఆ పరికరాల్ని సప్లైచెయ్యవలసి వుండగా ఊహించని సాంకేతిక లోపాలవల్ల వారు సరైన సమయానికి 'ట్రాన్స్‌ఫార్మర్లు' రెడీ చెయ్యలేకపోయారు. అదిగో... సరిగ్గా అదే సమయానికి మన చివరి ఉత్తరం చేరింది. మొదట్లో మన ఉత్తరాల్ని లైటుగా తీసుకున్న వాళ్ళే, అనుకోని లోపాలు తలెత్తేసరికి దిగివచ్చారు. ఒక విధంగా మన ప్రతిపాదన వారికి దేవుడిచ్చిన వరంగా మారింది. దాంతో ఏదో మనకి సహాయపడుతున్నట్టు కామేశ్వర్రావుని మనవద్దకి పంపి, మన ట్రాన్స్‌ఫార్మర్లని తిరిగి కొనుగోలుచేసి తమకి రాబోయే కోట్ల నష్టంనుండి బయటపడటమేకాక మార్కెట్టులో చెడ్డ పేరు రాకుండా కాపాడుకోవాలని చూసారు. 'దీపక్ ఎలక్ట్రికల్స్‌కి గడ్డుకాలం' అన్న అర్థంతో ఇంగ్లీష్ పేపర్లో ఓ వార్త వచ్చింది. అది చదివిన నాకు మొత్తం విషయం అర్థమైంది. దాంతో వారి అవసరాన్ని మనకి అనువుగా ఉపయోగించుకున్నాను" అంటూ ముగించాడు మోహన్‌రావు.

"హేట్సాఫ్ సార్...!" అభినందించకుండా వుండలేకపోయాడు శివ.

ఆ రోజు ఆఫీసు పని ముగించుకుని యింటికి వెళ్ళే ముందు, గోడకున్న కొటేషన్ వైపు ఎప్పటిలాగే చూసాడు మోహన్‌రావు. 'మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి...' అన్న రాతని యిప్పుడు ధైర్యంగా తలెత్తుకుని చూస్తూ మరీ ముందుకు సాగాడు. ★